# గుర్రపు డెక్క.

ఒక అపస్మారకంలో.. ఎవ్వరో నాలోపల స్మరించిన మంత్రాక్షరాలు.. అక్షరాలా మంత్రాక్షరాలే...యాంత్రిక మంత్ర తంత్రాక్షరాలు.. నాలో ఎవరో ఎవరెవరో... నా లోపలికి తొలుచుకుని...నన్నింకో నన్నుగా మలచి....

నా కళ్లు లో.... లోపలికి...

ఇంప్లోషన్

భా.......ం......న్స్స్...

చుప్...ప్.....ప్.....

శూన్యం

నా చెవులు నాచే విసర్జింపజేయబడి.....

నావికాని ఏవేవో ఉచ్ఛరణలు వింటూ.....

'ఆగుఁ!' 'ఎక్కడికి?' 'డూయిటగేన్' 'ఛీఁఛీఁఛీఁ కాంట్యూ' 'రా!' 'ఇంతమాత్రాని కింతాయసమా!' అంత యెందుకూ ఇట్స్‌వేస్ట్ యూజ్‌లెస్ అబ్సలూట్లీ యూజ్‌లెస్..... న్స్స్..'

ఎవరి స్వప్నాలోకంటూ.. కిరాయి కలలు...

ఆకుపచ్చటి సాయంకాలాలూ... ముక్కువాసనల ఏసీగదుల డిన్నర్లూ.. బొద్దింకలు నమిలుమిసిన నాఫ్తలీన్ వాసనలు చల్లబరిచిన గాలి వీవెనలూ.. తెల్ల కొవ్వొత్తుల నల్ల కాంతుల్లో ముక్కల ముక్కల ముఖాల అతికించిన చిర్నవ్వులూ... హోలీషిట్.

క్రూసిఫిక్షన్... ప్రతి వక్కడూ ఒక్కోడూ ఒక్కో ఇమ్మానియేలో లేదూ పక్కన ఉమ్ములు మిసిన దొంగలో... అంతే అంతే క్రూసిఫిక్షన్ క్రాసు మీద... సిలువ విలువ.

క్రాసు... పవిత్ర విలువల్ని కొలిచే త్రాసు... ఒహోహో...

బహవుల్లా ఏమంటాడో!? ఢిల్లీలో పద్మాలయం పాలరాత్తో కట్టించమన్నాడా యేం? ఓ ఉరికొయ్యకింద వేలాదిగా... వేనవేలు... వేలాదిగా ఆనాదిగా ముక్కలు చెక్కలై

శిథిల పూర్ణత్వాలై... పరిపూర్ణ శిథిలాలై

ఎన్నెన్ని కోరికలు కలలూ?!

ఆ చిలుక

ఈ పిచుక

ఎన్ని రాబందులూ?!

ఈ చిగురు

ఆ పూవు

ఎన్నెన్ని తుఫానులూ?!

✦✦✦

ఎక్కడినించీ ఎక్కడికొచ్చాను

ఎప్పుడు మొదలైందీ ప్రస్థానం... నానెక్కడ? ఈనెనెవ్వరు? నాది కాని జీవితాన్ని నేను జీవిస్తూ దాన్ని ప్రేమించేదెలా?

వైబ్రేట్ మోడ్‌లో పెట్టుంచిన సెల్ జేబులో వణికింది...

"హలో"

"హాఁ అగే నిన్యువర్ డ్రీంలాండ్? అటాప్సీ కేస్... ఎక్స్యూమ్ చేసి స్పాట్‌పీ.ఎమ్. ... సస్పెక్టెడ్ హోమిసైడ్.. కట్నంచావు... రొటీన్కాదు ప్రోగ్రిసివ్ విమెన్స్ ఆర్గనైజేషనుంది దీని వెనుక... అందుకే అడ్వాన్స్‌గా ఇన్ఫాం చేస్తున్నా... సియ్యె ముచికుంద్ పిలుస్తాళ్లే యింకాస్సేపట్లో... బీ ప్రిపేర్డ్ ఫారెవాం నైట్ బైబై" కొలీగ్ పరమాత్మ...

శవం... తవ్వితీసి... చావుక్కారణాలు వెదకాలి

...

ఆడశవం...కుళ్లిన ఆడశవం.... ఆడది కుళ్లిందా? ఆడదాని శవం కుళ్లిందా? వాన్నైట్ వెచ్చటి రాత్రి... ఆర్సీ విస్కీ సిల్కుపరదా...రక్తమాంసాల్నీ కొవ్వు ముద్దల్నీ నంచుకునే సరదా.. రాత్రి వెచ్చగా.. సీయ్యెతో లాలూచీ... సాంఘిక లావాదేవీల్లో ఇదీ ఓటి... వన్ మోర్ ట్రాన్సాక్షన్...

గుట్టమీద గెస్టౌస్‌లో..

గెస్టౌస్‌లో గుట్టుచప్పుడు కాని గుండె చప్పుళ్లో... తప్పుడు పనుల్లో....

నీలి సరదాలు...

రాత్రిళ్లకు సిగ్గెందుకేయదూ... సిగ్గున్చీకటి నాకేస్తుందా?

కుళ్లి కంపుకొడ్తూ... చీకిపోయి...చివికిపోయి...సగం మన్నైన శరీరం...

సగం శరీరమై మన్నూ.. ఊడొచ్చే వెంట్రుకలూ... చర్మమూ..

"తనువా హరిచందనమే' 'చందన్ సా బదన్' దగా దగా.. షీర్ డిసెప్షన్ యాక్కు గబ్బు గబ్బు.... ఎక్కడి వరకూ...నచ్చునిదంతా అంతే.. యోగవాసిష్టం..

చీతాలామచెందులుక్కూ లా...ప్చ్.... వెర్రివెంగళాయి అర్థంకాలేవాడిక్కూడా పద్నాలుగేళ్లు అంగలార్చాడు. పద్నాలుగేనా? సిలోన్ విలనోడి కిడ్నాప్ తర్వాత ఊపిరి

పీల్చుకునుంటాడు. జల్సాగా తర్వాత ఎక్స్‌కర్షన్లాగావెతికినట్టు నటించుంటాడు.. కోతిమూకలు వెతికి పట్టుకొస్తే అందరికోసం అంటగట్టుకుని మళ్లీఅడవికి తోలేసాడు.. సెబ్బాష్‌ష్...

అయాంనాటెకింగ్, శ్రీరామచంద్ర మూర్తిలాగా..అయ్‌కెనాడ్డ్దాదట్... దొంగలు బాబోయ్ దొంగలు దొంగలు...

శవాన్ని తవ్వి తీయాలి.. పాతిపెట్టి న్నిజాన్ని ప్యాక్చేసి పట్టుకెళ్లి కడిగి... కోసి అణువణువూ శోధించి...

"తను" రమ్మందే ఎలా?

అంఖోమె మస్తీ షరాబ్‌కీ...కాలీజుల్ఫోమ్ రాతె షబాబ్‌కీ... అదీ...అలాగ... ఇలాంటిచోట... తనువాచందన్‌లు రాగాలు నూరుకోవాలి. రేగిపోయి చెలరేగి.. ఆగి వూగి తూగి ఈ రోజుకా కలల్ని వాయిదావేయ్... సగటు మానవా! ఈ స్వప్నాన్ని రేపట్లోకి బదిలీ చెయ్... నీకు చేతనైంది 'కలలమార్చేకదా? ఫవర్ ఫెలో..

"వాట్స్ దమాటర్ స్టిల్ ఫుల్లీ ట్రెస్డ్ - గోయింగొట్?"

డెబ్బైయ్యారు కిలోల కొవ్వుముద్దలు.. ఎర్రటి చర్మపుసంచీలో మూటలు మూటలుగా ఒదిగి...

ఆ కొవ్వు మూటల బస్తా సోయగం ఆడపదార్థం నించీ సమాధానమాసించినట్టా లేనట్టా...

కెనెనీబడీ సేవ్ దిస్ హ్యాప్లెస్ హ్యూమన్బీయింగ్?

హౌ హ్యూమేనయాం??? తప్పులే తప్పులు.. మనిషినిగదా?

'ఎరారీ హ్యూమానం ఎస్ట్'ల్యానిట్లో నైనా అచ్చుపచ్చి గ్రామీణ తెలుగులో నైనా తప్పుతప్పు... ల మనిషే...మనిషి...పశువూ?

ప్రేమ శారీరికావసరమ్మే... ముమ్మాటికీ...

చల్లారిపోయిన పెనమ్మీద అట్లులెయ్యవ్... అటులే చటులాలంకారప మటుమాయలుపోయిన సంవత్సరమొదిలేసిన కమీజ్‌లోకే నేను దూరలేనే...

"రాత్తిర బోయనానికొస్తావా? కరీంగాడిని పట్కెళ్లమనీనా?"

అన్నం మిగల్టానికి వీల్లేదూ..బోయనమట బోయినం....

ఏటి ఒడ్డున .. తుమ్మచెట్టు నీడల్లో...ఎర్రటి చంద్రనిప్పులు చెరిగే మధ్యాహ్నం.. తుమ్మకాయల్ని మేస్తూ మేకలూ... మేకల వాసనా... పైన ముళ్లకొమ్మల మధ్యన పాలపిట్టలూ.. పాలపిట్టల నీలి ఈకలూ.. చొట్టలు పడ్డ ఇత్తడి క్యారేజీలో మెత్తటి జొన్న సంగటీ... దాని మధ్యన సాయంత్రపు సూర్యుడిలా మిరపకారం.. ఏట్లో తోడిన చెలమలో చల్లటి తీయటినీళ్ళూ.. కాళ్ల కింద కదిలిపోయే ఇసుక...

భక్ష్య భోజ్య లేహ్యచోష్య పానీయ..అదీ బోయనం తెలుసా నా కొవ్వు పొట్లమా...

మొన్నటికి మొన్న రాత్తిర'ఆకలి' అన్నేనంటే 'తను' అప్పటికప్పుడు వేడి వేడన్నం మల్లెల బువ్వా.. వెల్లుల్లి కారంగుండా.. కమ్మటి నెయ్యీ... ఆవకాయబద్దా మీగడ

పెరుగూ..

ఇక్కడ పెరగటం లేదు... అంతా విరుగే విరుగే అవిరి కుడుమా.. మై ఫుట్...

"ఆయా మీటింగొట్" అన్నట్టుసైగ

"ఎవళ్లతోటీ?" అనవసర విషయాలాలస..

"పోస్టుమార్టమ్ మ్యామ్" శవాల్తో కల్సిబోయనం.. ఫీస్టింగ్ విత్ ద డెడ్... హహ్హా...

"ఓహ్ అయ్ థాట్ డిఫరెంట్లీ" యా ఇటీజ్ డిఫరెంట్.. ఇటాల్వేస్ ఈజ్.. సక్రమంగా ఆలోచించేడిచిందెప్పుడూ అని...

"విల్యూబీలేట్?" ఇట్స్ ఆల్రెడీ టూ లేట్....

"కాంట్సే"

సీయైయ్యే ముచికుందుడి ఫోన్ తర్వాత...నా మెటామార్ఫసిస్ నాకు రెక్కలు మొలిచాయి...

✦✦✦

అలిసిపోయున్న నన్ను 'తను'... మరీ యవ్వనం.. లేదు...కాదు... వుంది...అ దే అంతే..

ఇప్పట్నించీ రేపట్లలోకి ఎల్లుండ్లలోకి పరిగెడుతూ...బాల్యంలో అంతమవుతుంది. 'తను'

అప్పుడు ఓ ముసలాడు పదేళ్ళ పాపతో శృంగారం? ఏమో?

జనాలందరూ మఫ్టీలో పోలీసులే.. యూనిఫాంలో జనద్వీపం మధ్య మరో మనిషి.

ఎవర్నెవరు అదుపూ?....

రిడిక్యులస్.. షీర్ నాన్సెన్స్... ఎక్కడో ఎవరికోసమో ఎవరో నిరంతరంగా ఎదురుచూట్టం.. ఎక్కడికో వెళ్ళిన ఎవరో తిరిగొస్తే..బావుణ్ణనుకుంటూ...

'తన'కోసందేశం రాసి పంపాలి. నా చర్మంతో ఓ ప్యాలింప్సెస్ట్ చేసి దానిమీద వెయిట్ఫర్మీ అని పచ్చపొడిపించి...పంపాలి.. ఆయాసం..

నేను తనకెంత రుణం?

నా యావద్దేదమోదాలు... నా తప్పొప్పులూ... చిటికెడు స్వర్గం....

ఎంత బాకీయో?!

జంత్రానికీ స్వరరాగ సుధాదృతికీ కృతికారుడికీ..

గ్వార్నెరీ.. ఆ మాటీలకీ.... ద్వారం వెంకటస్వామి నాయుడు 'మేఘమల్హార్' చుట్టపొగల్తోచెల్లించినంత...

సారంగీకి తారగా మార్చి తన స్నాయువును ఆయువుగా చేసిన మృగానికి, వాద్యకారుడిగోరెంత బాకీ.....

అరగంట జ్వలనం... మండి మండి చివరాఖరికి రాగమావిరైపోదూ...

వద్దు వద్దు వద్దు వద్దు...

ఈ బలవన్మరణ సదృశ జీవితం యాక్కు...

సభ్యసమాజమా! ఆరోగ్యవంత సంఘమా! ఓ మహాసంస్కృతీ!
మీ అందరి ముందూ మోకరిల్లి తొప్పప్పుకుంటాను. తప్పనిసరి తప్పనే స్వీకరిస్తానని ప్రమాణం చేస్తాను.

దిస్ సిన్ ఈజ్ డివైన్....

దిస్ అన్హోలీనెస్ ఈజె బ్లిస్...

ఈ చీకట్లు జ్వాజ్వల్యాలు..

ఏ పాపమెరుగని నంగనాచి పాపం టూటౌన్ పోలీస్‌స్టేషన్...

నా కోసం నిరీక్షణ ముచికుంద్‌గా పరిణమించి... నా కోసమేనా? నే...నే.... నే...
"హెలో ఎక్కడా? ఎప్పుడూ?" మూర్తీభవించిన యాంత్రికత్వం నేనై...
"హైవే బరియల్‌గ్రౌండ్... టుమారో మానింగ్... కొత్త ఆరైగారు.. ఆరైగారూ! డాక్టర్"

"హెలో" 'హెలో'

ఇట్స్ టుబి డిక్లేర్డ్ హోమిసైడ్... పైనించీ తాఖీదు...ఇటీజ్ ఇన్ఫ్యాక్ట్... హహ్హాహా" ఎవర్నెవరు చంపుతారూ... నన్ను నేనెన్నిసార్లు హత్య చేసానూ... హెలో...

"టుమారో మానింగ్... నేనిక్కడికొచ్చేస్తా సర్" ఆరై... ఆరై.. జీవితకాలం రిగరాస్ ఇంప్రిజన్మెంట్...

పాతబడిన పాపంలో వీడికెన్ని పిడికిళ్లో....?

ఆడశవం పాపం...! పాపం ఆడశవం...!

"హౌవోల్డ్ ఈస్దడెత్"? పురాతనమైన మరణానికి వయసేంటి?

"సెవెన్టీన్‌డేస్.. ఆరైగారూ రేపు ఇక్కడికేరండి కలిసెల్దాం"

పాపపు పిడికిలి తలూపింది అశ్లీలంగా... కదుల్తూ వెళ్లిపోయింది.

"నైట్ ఫ్రీనే కదా హహ్హాహా" మనిషంతా బొర్రలాగే అయిపోయి...

గోగోల్ ముక్కులా ఓ పిడికిలీ ఓ బొర్రా....భలే.

"ఇంకా చీకటే పళ్లేదూ?" చీకటే చీకటి వెల్తురేఈ.. 'తన' ఇంట్లో 'తన' గుండెల్లో...
"అన్నీ కుదిరేసరికి అదే చీకటౌతుంది. రమ ఒకేనా? ఇంకా చెప్పలేదు. ఒక్క ఫోన్ చాలు వచ్చేస్తుంది". హహ్హాహా గోగోల్‌బొర్ర...

"సీ డ్రింక్స్ హెవిలీ... మనం నెక్రొఫీలిక్స్‌లాగా ఆడుకోవాలి" పీనగల్తో కామ కేళి...

"పొద్దున్న లేచినప్పటించీ పీనుగులే కదా మీ కంపెనీ" యూటూ ఆర్ వన్ బాస్టః... మీటూ.. నిజంనిజం ఇంట్లో కూడా ఓ పీనుగుంది. కొవ్వుబస్తాల మూటల మూటల పీనుగ...

"సెల్ ఓమాటివ్వండి"

"రమకేనా?"

"యాః హెలో రమ స్టాఫ్ ఉన్నారా? హాయ్... ఆఁఆఁ నేనే నైట్ గెస్ట్స్ కొచ్చేయ్ సెవెన్తర్టీ... ఎవ్వరూ లేరు నేనూ డాక్టర్ అంతే.. ఇట్స్ గోయింగ్ టుబీ ఆర్జీ అండ్

లాట్సాఫ్ చికెన్ ఫ్రం ఇంటర్నాష్యనల్... బై"

నాకు రమా వద్దు ఆర్సీ వద్దు 'తను' కావాలి... ఒరే సామాజికుడా! కోరికలకు కలలమ్ముకునేవాడా! ఇదెన్నో ట్రాన్సాక్షనూ?

అదిస్తే....యిదిస్తా.. దీనికి నాకది కావాలి....

నా నవ్వుకు నీ కన్నీళ్లిస్తావా?

నా దాహానికి నీ దేహాన్ని తవ్వనా?

నీ కలలకి నా కళ్లు అద్దెకిస్తా... ట్రాజెడీ..

అల్ దిసీజ్ ఎ సేక్రెడ్ ట్రాజిడీ....

ముచికుందుడితో లాలూచీకి ఓ కలబలి... రాత్రి గెస్టౌస్‌లో ఓ పాట చిరిగి పోయింది.... ఓ స్వప్న బిందువు చితికి పోయింది... రమ అనే శవంతో క్రీడించిన ఇద్దరు సభ్య సామాజిలొచ్చేసిం తర్వాత .. నరికేసిన మొద్దు... బాహ్యాస్పృహ కతీతంగా..పడగవిప్పిన కోరిక సెంట్రీ ఇంకో నెక్రోఫీలిక్...

✦✦✦

మర్నట్రోజు...... స్మశానంలో ప్రగతిశీల మహిళలు... మరణకారణ నిర్ధారణకు మేమూ.. సియ్యెయ్యే ముచికుందుడు...

"తవ్వండి....శవాన్ని బైటికి తీయండి" హుకుం... నిజంగా మరణించి జీవించిన శవం... ఒకటి....రమ రెండు.... కొవ్వు బస్తా మూడు... 'తను' నాలుగు.. ఎన్నో ఎన్నెన్నో...

"తవ్వండి శవాన్ని జాగ్రత్తగా తీయండి"

ఎన్నో యుగాల క్రితం... దుమ్మూధూళీ పొరల నడుమ నన్ను నేను పాతిపెట్టుకున్నానే నన్నెవరు వెలికితీసి నా మరణకారణ నిర్ధారణ చేయాలి? మనిషి.... ఇంకో మనిషి... మరో మనిషి.... 'తను' ఆకాశంలో ఓ స్వేచ్ఛాకేతనం ఎగరేసి నిన్న రాత్తిర 'తన' డయిరీలో యిలా రాసుకునుంటుంది.

నేనతన్ని సరేనని నన్నడగమని నా కళ్లతో అడిగాను... అతనడిగాడు సరే నంటానకి సరేనా అని.. నా కొండ పూవు.. ముందుగా అతని చుట్టూ చేతులు వేసి సరే... నా దగ్గరికి లాక్కుంటాను.. నా వక్షోజాల పరిమళంతో ముంచి సరే అతని హృదయం వెర్రి ఆనందంతో సరే... నేననేస్తాను సరేనంటానికి సరేనని..."

(పై చివరి వాక్యం జేమ్సు జాయిన్ యులిసిస్ నవలలో చివరి వాక్యానికి మక్కీకి మక్కీ...సరే......) ✦

*(వార్త దినపత్రిక : 1 ఏప్రిల్ 2001)*